సాక్షి
కాకినాడ

మంగళవారం । 23 । జనవరి । 2024




రూ.50 వేల విరాళం
ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి వెలగపూడి వెంకటేశ్వరరావు దంపతులు (విజయవాడ) రూ.50 వేల విరాళం అందజేశారు.



చదువుల మదింపు
10లో

విద్యార్థి అభ్యసనాన్ని మదింపు చేసేందుకు విద్యాశాఖ ఏటా నిర్వహిస్తున్న ఫార్మేటివ్ అసెస్‌మెంట్-3 (ఎఫ్‌ఏ-3) పరీక్షలు మంగళవారం ప్రారంభమవుతున్నాయి.

10,950 క్యూసెక్కుల విడుదల


ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు సోమవారం 10,950 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.90 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

స్పందనకు 245 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ ఇలక్కియ, ఇతర అధికారులు

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమానికి 245 అర్జీలు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, బీసీ కార్పొరేషన్ ఈడీ అద్దంకి శ్రీనివాసరావు, సీపీఓ పి.త్రినాథ్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ డి.పుష్పమణి విజ్ఞాపనలు స్వీకరించారు. అనంతరం జేసీ ఇలక్కియ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ, ప్రజలు సమర్పించిన అర్జీలకు సకాలంలో నాణ్యమైన పరిష్కారాలు చూపాలని ఆదేశించారు. ఒకే అంశంపై మళ్లీ మళ్లీ అర్జీలు నమోదు కాకుండా దృష్టి సారించాలని సూచించారు.

గణతంత్ర వేడుకలకు త్వరితగతిన ఏర్పాట్లు

కాకినాడ సిటీ: ఈ నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని కాకినాడ ఆర్‌డీఓ ఇట్ల కిషోర్ ఆదేశించారు. జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సంబంధిత ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. గణతంత్ర వేడుకలకు హాజరయ్యే అతిథులకు, ప్రశంసా పత్రాలు పొందే వారికి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే వారికి, తిలకించే వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. తాగునీరు, షామియానా, పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని అన్నారు. ప్రభుత్వ ప్రగతిని తెలిపే స్టాల్స్ ఏర్పాటు చేయాలని, ఈ వేడుకలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రూరల్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలకు తుది ఓటర్ల జాబితా అందజేత

కాకినాడ సిటీ: తుది ఓటర్ల జాబితా వివరాలను జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ సోమవారం వివరించారు. గత ఏడాది అక్టోబర్ 27న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాకు, తుది ఓటరు జాబితాకు జరిగిన మార్పులు, జిల్లాలోని మొత్తం ఓటర్ల వివరాలను తెలియజేశారు. తుది ఓటర్ల జాబితాకు సంబంధించిన సీడీలను వారికి అందజేశారు. సమావేశంలో డీఆర్‌ఓ కె.శ్రీరమణి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీకి ఎంపిక

నిడదవోలు రూరల్: తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణశాస్త్రి సోమవారం ఈ విషయం తెలిపారు. తణుకులో జరిగిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీల్లో తమ విద్యార్థులు ఎం.సురేష్, కె.రుషిత, పి.శ్యామల ప్రతిభ చూపి, కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యారని వివరించారు.

ఆమెదే అగ్రస్థానం

- ఓటర్ల తుది జాబితా విడుదల
- జిల్లాలో మొత్తం ఓటర్లు 15,99,065
- పురుషులు 7,88,105
- మహిళలు 8,10,781
- ఇతరులు 179



సాక్షి ప్రతినిధి, కాకినాడ: సార్వత్రిక ఎన్నికల సమరానికి అస్త్రశస్త్రాలతో ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. మరో రెండు నెలల్లో జరగనున్న ఎన్నికల కోసం పోలింగ్ బూత్‌లు, ఓటర్ల తుది జాబితాను జిల్లా యంత్రాంగం సిద్ధం చేసింది. ఎన్నికలంటే తొలి మెట్టు ఓటు హక్కు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. అటువంటి సార్వత్రిక ఎన్నికలు మార్చి లేదా ఏప్రిల్‌లో జరుగుతాయని భావిస్తున్నారు. ఈలోగా షెడ్యూల్, నోటిఫికేషన్ వెలువడతాయని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. దీనికి ముందే ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఓటర్ల జాబితా సవరణలను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. అనంతరం తుది ఓటర్ల జాబితాను కలెక్టర్ కృతికా శుక్లా సోమవారం కలెక్టరేట్‌లో విడుదల చేశారు.

ఇవీ విశేషాలు

- గత అక్టోబర్ 27న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 15,89,755 మంది ఓటర్లు ఉండేవారు. వీరిలో 11,510 మంది మృతి చెందారని, 41,958 మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని నిర్ధారించారు. మరో 7,700 మందిని డబుల్ ఎంట్రీ ఓటర్లుగా గుర్తించారు. మొత్తం పరిశీలనల అనంతరం 61,168 మంది ఓటర్లను తొలగించారు.
- ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 ప్రక్రియ చేపట్టిన తరువాత 28,471 సవరణలు చేపట్టారు. కొత్తగా 18 సంవత్సరాల వయస్సు నిండిన వారిని ఓటర్లుగా చేర్పించారు. దీనికోసం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు, స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించారు.
- ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించిన నాటికి జిల్లాలోని 2,013 ఇళ్లల్లో 10 మంది కంటే ఎక్కువ ఓటర్లు నమోదయినట్టు గుర్తించి, వాటిని సవరించారు. మరో ఎనిమిది ఇళ్లలో 10 ఓట్లు పైన నమోదైన వారు ఉన్నట్టు గుర్తించారు.
- తుది జాబితా ప్రకారం.. జిల్లాలో ఓటర్ల సంఖ్య 15,99,065కు పెరిగింది. వీరిలో పురుషులు 7,88,105, మహిళలు 8,10,781, సెక్స్ వర్కర్లు 6,937, ట్రాన్స్‌జెండర్లు 179 మంది ఉన్నారు.
- మొత్తం మీద పురుషుల కంటే మహిళా ఓటర్లు 22,676 మంది అధికంగా ఉన్నారు.
- కొత్తగా 70,478 మంది కొత్తగా ఓటు నమోదు చేసుకున్నారు.
- కొత్తగా ఓటు పొందిన వారిలో 18 నుంచి 19 సంవత్సరాల వయస్సు ఉన్న యువతదే అగ్రస్థానం. వీరు 26,059 మంది ఉన్నారు. వీరందరూ రానున్న ఎన్నికల్లో తొలిసారిగా తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.
- జిల్లాలో 17,716 మంది దివ్యాంగులు, 801 మంది సర్వీసు ఓటర్లు నమోదయ్యారు.
- ముసాయిదా ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ సందర్భంగా ఒకే ఫొటోలు ఉన్నవారు 5,414 మంది ఉన్నట్టు గుర్తించారు. అలాగే, 840 మంది ఒకే ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించి తొలగించారు.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
తుని	223	1,09,052	1,11,800	25	2,20,877
ప్రత్తిపాడు	227	1,05,412	1,082,027	20	2,13,639
పిఠాపురం	242	1,15,223	1,14,819	4	2,30,046
కాకినాడ రూరల్	264	1,29,58	1,31,591	11	2,61,186
పెద్దాపురం	200	1,04,446	1,07,478	13	2,11,937
కాకినాడ సిటీ	233	1,13,17	1,23,166	94	2,36,437
జగ్గంపేట	248	1,11,211	1,13,720	12	2,24,943

నియోజకవర్గాల వారీగా కొత్తగా నమోదైన ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం
తుని	4,693	4,892	2	9,587
ప్రత్తిపాడు	3,683	3,594	0	7,277
పిఠాపురం	4,096	4,236	1	8,333
కాకినాడ రూరల్	6,766	7,000	1	13,767
పెద్దాపురం	3,872	4,102	0	7,974
కాకినాడ సిటీ	7,141	7762	10	14,913
జగ్గంపేట	4,368	4,258	1	8,627
మొత్తం	34,619	35,844	15	70,478

1,637 పోలింగ్ కేంద్రాలు

గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో గత అక్టోబర్ 27 నుంచి నిర్వహించిన వివిధ సమావేశాల్లో తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో ఒక్కో పోలింగ్ కేంద్రం చొప్పున మొత్తం మూడు పోలింగ్ కేంద్రాలు అదనంగా ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 1,637 పోలింగ్ కేంద్రాలు ఉండగా వీటన్నింటిలో విద్యుత్, ఫర్నిచర్, టాయిలెట్లు, తాగునీరు, ర్యాంపులు తదితర సౌకర్యాలు కల్పించారు.

గిరిజనానికి తొలిసారి ఓటు హక్కు

కొండలపై నివసిస్తూ.. స్వాతంత్ర్యానంతరం ఇప్పటి వరకూ ఓటు హక్కు లేని గిరిజనులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ తొలిసారి ఓటు హక్కు లభించింది. ప్రత్తిపాడు మండలం గిరిజనాపురం గ్రామం ఇప్పటి వరకూ ఓటు హక్కు లేని గ్రామంగా ఉంది. దీనిని గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా గుర్తించిన కలెక్టర్ కృతికా శుక్లా ఆ గ్రామంలోని 11 కుటుంబాలకు ఓటు లేదని గుర్తించారు. వారిలో అర్హులైన 19 మంది గిరిజనులకు ఓటు హక్కు కల్పించారు. దీంతో వారందరూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో స్వాతంత్ర్యానంతరం తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా



ఎటువంటి అవకతవకలకూ తావు లేకుండా జిల్లాలో ఓటర్ల జాబితా సిద్ధమైంది. గత అక్టోబర్ నుంచి జిల్లాలో ఎన్నికల అధికారులు ఎంతో కష్టపడి సమర్థవంతంగా పని చేయడంతో పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించగలిగాం. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా రూపొందించిన తుది జాబితాలు ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్ స్టేషన్లు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓల కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయి.

– కృతికా శుక్లా, జిల్లా కలెక్టర్, కాకినాడ

ఊరూవాడా శ్రీరామ నామస్మరణే

- అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ వేళ ప్రత్యేక కార్యక్రమాలు
- విస్తృతంగా శోభాయాత్రలు, సంకీర్తనలు
- రామాలయాల్లో కల్యాణోత్సవాలు



సామర్లకోట మండలం నవర గ్రామంలో శ్రీరామనామ సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు



కాకినాడ రామారావుపేటలోని రామాలయంలో స్వామి వారికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ)/అన్నవరం: జన్మస్థలమైన అయోధ్యలో సోమవారం బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా సాగిన వేళ ఊరూవాడా 'జై శ్రీరామ్' నినాదాలతో ప్రతిధ్వనించాయి. అయోధ్యలో అందాల బాల రాముని విగ్రహాన్ని సోమవారం ప్రతిష్ఠించిన వేళ.. ప్రతి హిందువు ఇంటా పండగ వాతావరణం నెలకొంది. జిల్లా లోని పట్టణాలు, పల్లెల్లో ప్రత్యేక పూజలు, దశరథ తనయుని ఉత్సవ విగ్రహాలతో వీధివీధినా కోలాహలంగా శోభాయాత్రలు, పల్లకీ సేవలు నిర్వహించారు. సీతారామ చంద్రునికి పట్టాభిషేక మహోత్సవాలు, కల్యాణోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు. జిల్లాలోని 1,500 రామాలయాల్లో ఉదయం నుంచే పండగ వాతావరణం నెలకొంది. అయోధ్య బాలరాముని పూజాక్షతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. సాయంత్రం ప్రతి ఇంటా పూజా మందిరంలో రెండు, ఇంటి బయట గుమ్మం వద్ద రెండు, తులసికోట వద్ద ఒకటి చొప్పున దీపాలు వెలిగించి, పూజలు నిర్వహించారు.

- కాకినాడలో పలు ధార్మిక సంస్థల ఆధ్వర్యాన శోభాయాత్ర, బైక్ ర్యాలీలు, రామాలయాల్లో కల్యాణోత్సవాలు నిర్వహించారు. హిందూ ధర్మ పరిరక్షణ ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యాన ఆనంద భారతి మైదానంలో శ్రీరామ తారకనామ మహా మంత్ర జపం, మహా పూర్ణాహుతి నిర్వహించారు.
- బాల రాముని ప్రాణప్రతిష్ఠా మహోత్సవాన్ని భక్తులు వీక్షించేందుకు పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఎల్‌ఈడీ స్క్రీన్ పెట్టారు. పట్టణంలో తొలుత శోభాయాత్ర నిర్వహించారు.
- హిందూ ధర్మపరిరక్షణ రామసేన వ్యవస్థాపకుడు కంభాల శ్రీనివాసరావు ఆధ్వర్యాన గోకవరం మండలంలో వెయ్యి బైక్‌లు, కార్లు, ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు.
- సామర్లకోట ప్రసన్నాంజనేయస్వామి ఆలయం నుంచి సుమారు 200 మంది మార్వాడీలు శోభాయాత్ర నిర్వహించారు.
- అన్నవరం దేవస్థానంలో క్షేత్రపాలకులు సీతా రాములకు అర్చకులు సహస్ర నామార్చన నిర్వహించారు. రామరక్షా స్తోత్ర పారాయణ చేశారు. రామాలయాన్ని పూలమాలలతో అలంకరించారు. కార్యక్రమాల్లో దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు. బాల రాముని ప్రాణప్రతిష్ఠాపన ప్రత్యక్ష వీక్షణానికి ప్రత్యేకంగా డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశారు.

మరణం తర్వాత పగ కూడదు



సామవేదం షణ్ముఖశర్మ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మరణం తర్వాత పగ ఉండరాదంటూ విభీషణుడికి శ్రీరాముడు హితవు పలికాడని సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. శ్రీరామాయణం 41వ రోజు ప్రవచనాన్ని ఆయన హిందూ సమాజంలో సోమవారం కొనసాగించారు. 'ఆదిత్య హృదయాంతర్గత పరమాత్మయే రాముడు. రాముని కోసం ఇంద్రుడు దివ్య రథాన్ని, మాతలి అనే సారథిని, దివ్యకవచాన్ని, బల్లాన్ని పంపాడు. రామునికి అగస్త్యుడు సర్వమంత్రాత్మకమైన ఆదిత్య హృదయాన్ని బోధించి, ముమ్మార్లు పఠించమని సూచిస్తాడు. ఈ మంత్రం ద్వారా రామునిలోని నారాయణ తేజాన్ని అగస్త్యుడు వెలికి తెచ్చా డని మనం భావించాలి' అని సామవేదం అన్నారు. రామునికి అడవిలో అడుగడుగునా మహర్షులే మా ర్గాన్ని సూచించారని చెప్పారు. గాయత్రీ మంత్రద్రష్ట అయిన విశ్వామిత్రునితో ప్రారంభమైన రామకథ అ డుగడుగునా మహర్షుల మార్గనిర్దేశంతోనే సాగుతూ, యుద్ధకాండలో అగస్త్యుని ఉపదేశం వరకూ నడిచింద ని వివరించారు. 'మాతలి సూచనతో రాముడు బ్రహ్మాస్త్రాన్ని అభిమంత్రించి రావణునిపై ప్రయోగించాడు. ఆ అస్త్రం రావణుని హృదయాన్ని చీల్చి తిరిగి రాముని తూణీరంలోకి చేరింది. రావణుడు మరణించాడు. 'రావణుడు మహావీరుడు. వీరోచితంగా పోరాడి మరణించాడు. ఇది దుఃఖానికి సమయం కాదు' అంటూ విభీషణుడిని రాముడు ఊరడించాడన్నారు. మండోద రి రోదిస్తూ 'ఇంద్రియాలను జయించి గొప్ప తపస్సు చేశావు. ఇప్పుడు ఆ ఇంద్రియాలకు లొంగిపోయి, మరణాన్ని తెచ్చుకున్నావు. నీ ఇంద్రియాలే నీకు మరణా న్ని తీసుకువచ్చాయి. రాముడు యముడో, ఇంద్రుడో కాదు. నిన్ను ఎదిరించే శక్తి వారికెక్కడిది? వచ్చిన వా డు మహాయోగి' అని అంటుంది. యోగి అన్నది విష్ణు సహస్ర నామంలో విష్ణువు పేరు. రాముడు సనాతనుడయిన నారాయణుడేనని మండోదరి గుర్తిస్తుందని సామవేదం చెప్పారు. అన్నకు అంతిమ సంస్కారాలు చేయడానికి విభీషణుడు ఇష్టపడడు. రాముడు నచ్చచెబుతాడు. 'పగ అనేది శత్రువు మరణించే వరకే. మరణం తర్వాత పగ కూడదు. ఇప్పుడు రావణుడు నీకూ నాకూ గౌరవార్హుడే. నీవు నాకు ఎంతో ఉపకారం చేశావు. నీకు మంచి చెప్పడం నా బాధ్యత. నీవు రావణుని అంతిమ సంస్కారాలు చేయవలసిందే'నని రాముడు చెబుతాడంటూ సామవేదం వివరించారు. కాగా, గత నెల 12న ప్రారంభమైన రామాయణ ప్రవచన యజ్ఞం మంగళవారం ముగియనుంది. అనంతరం పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తారు.

జగనన్న మాట.. బంగారు బాట

- డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు నేటి నుంచి వైఎస్సార్ ఆసరా
- 30వ తేదీ వరకూ నాలుగో విడత నిధుల జమ
- జిల్లాలో 37,442 సంఘాలకు రూ.300.22 కోట్ల లబ్ధి
- గడచిన మూడు విడతల్లో రూ.899.75 కోట్ల అందజేత
- సీఎం జగన్ హామీ నిలబెట్టుకున్నారంటూ మహిళల హర్షం



వైఎస్సార్ ఆసరా పథకంపై డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పిస్తున్న యానిమేటర్ జ్యోతి

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా పథకం డ్వాక్రా అక్కచెల్లెమ్మల మోములో సంతోషాలను పూయిస్తోంది. ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లకు పైబడిన పాలనలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తూ వస్తున్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా అమలు చేస్తున్న ఈ పథకాల ద్వారా నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమయ్యాయి. తాము అధికారంలోకి వస్తే 2019 ఏప్రిల్‌కు ముందు డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని గత సార్వత్రిక ఎన్నికల సమయంలో నాటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ కింద వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇప్పటి వరకూ మూడు విడతల్లో రూ.899.75 కోట్లు అందించారు. నాలుగో విడతగా నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకూ జిల్లాలోని 37,442 స్వయం సహాయక సంఘాల్లో చెందిన 3,74,820 మంది అక్కచెల్లెమ్మలకు నిదులు జమ చేయనున్నారు. ఆసరా నిధుల చెల్లింపు సభలు నిర్వహించేందుకు ఇప్పటికే మండలాల వారీగా షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ సభల్లో ఆయా మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ.300.22 కోట్లు జమ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ ఆసరా పథకానికి సంబంధించి అర్హుల జాబితాను ఆయా గ్రామ/వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంచారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తూ ప్రభుత్వం ద్వారా ఇంత వరకూ ఎంత మేర ఆసరా నిధులు జమయ్యాయి, మిగిలిన వాయిదాలకు సంబంధించి ఎంత మేర రుణ మాఫీ జరుగుతుందనే విషయాలపై సంఘ సభ్యులకు వెలుగు అధికారులు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు అవగాహన కల్పిస్తున్నారు.

పసుపు – కుంకుమ పేరుతో టీడీపీ మోసం

గత టీడీపీ ప్రభుత్వం డ్వాక్రా సంఘాలను దారుణంగా మోసం చేసింది. గత సార్వత్రిక ఎన్నికల ముందు నాటి చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన పసుపు – కుంకుమ నిధులను బ్యాంకులు వడ్డీల కింద జమ చేసుకున్నాయి. దీంతో డ్వాక్రా సంఘాలు ఉనికి కోల్పోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ సమయంలో ప్రజాసంకల్ప పాదయాత్ర నిర్వహించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళల ఆర్థిక ఇబ్బందులను స్వయంగా గుర్తించారు. వారు తీసుకున్న అప్పు పూర్తిగా నాలుగు విడతల్లో మాఫీ చేస్తామని ప్రకటించారు. ఆ హామీ మేరకు వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేస్తున్నారు. దీంతో డ్వాక్రా మహిళల ఆర్థిక కష్టాలు గట్టెక్కాయి. వైఎస్సార్ ఆసరా తమ జీవనోపాధికి ఎంతో దోహదపడిందని, గడచిన 50 ఏళ్లలో ఏ ప్రభుత్వమూ తమను ఈ రీతిలో ఆదుకున్న దాఖలాలు లేవని డ్వాక్రా మహిళలు చెబుతున్నారు. ఇచ్చిన హామీల అమలు ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు అండగా నిలిచి, తమ ఆర్థిక అభ్యున్నతికి బాటలు వేస్తున్నారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆ ఘనత సీఎం జగన్‌దే..



ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసిన ఘనత ఒక్క ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్నీ నెరవేరుస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఆర్థికంగా చితికిపోతున్న పొదుపు సంఘాల మహిళల బతుకుల్లో వెలుగులు నింపారు. మాట తప్పని నేతగా ఆయన చరిత్రలో నిలిచిపోతారు.

– కందా లక్ష్మి, శివకృష్ణా కాలనీ, తూరంగి

సంఘాలకు జీవం



వైఎస్సార్ ఆసరాతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళా సంఘాలకు జీవం పోశారు. మా అప్పు పూర్తిగా నాలుగు విడతల్లో మా ఖాతాకు జమ చేయడంతో కొండంత బలం వచ్చింది. సీఎం జగన్‌కు మా మహిళలందరం ఎంతో రుణపడి ఉంటాం.

– మైలపల్లి సత్యవతి, డ్వాక్రా మహిళ తూరంగి

మహిళలకు పెద్దపీట



డ్వాక్రా సంఘాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా తీసుకున్న రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేస్తున్నారు.

– గుత్తుల నూకరత్నం, డ్వాక్రా మహిళ, సత్యదుర్గా నగర్, తూరంగి

అర్హులందరికీ వర్తింపు



డ్వాక్రా సంఘాల్లో అర్హులైన మ హిళలందరికీ వైఎస్సార్ ఆసరా పథకాన్ని వర్తింపజేశాం. దీంతో డ్వాక్రా మహిళలకు ఎంతో లబ్ధి చేకూరింది. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం.. నాలుగు విడతల్లో ఆసరా పథకాన్ని వర్తించజేస్తున్నాం. ఇప్పటికే జిల్లా లోని డ్వాక్రా మహిళలకు మూడు విడతల్లో రూ.899.75 కోట్లు చెల్లించాం.

– కె.శ్రీరమణి, ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, కాకినాడ

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

గండేపల్లి: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్‌చేసి కోర్టుకు తరలించగా పెద్దాపురం కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్టు జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణ రావు తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంనకు చెందిన షేక్ బాజీబాబా మోటార్ సైకిల్‌పై విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి వద్ద ఆరు కేజీల గంజాయిని రూ. 12,000కు కొనుగోలుచేసి సోమవారం తన స్వగ్రామం బయలుదేరినట్టు తెలిపారు. గండేపల్లి శివారు దాబా వద్ద ఎస్సై ఎస్.రామకృష్ణ వాహనాలు తనిఖీ చేస్తుండగా బాజీబాబా గంజాయిని తరలిస్తున్నట్టు గుర్తించారు. గంజాయిని, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని పెద్దాపురం కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్టు తెలిపారు.

చదువుల మదింపు

- నేటి నుంచి ఎఫ్ఏ-3 పరీక్షలు
- 1-8 తరగతులకు సీబీఏ, 9, 10 వారికి పాత విధానం
- జిల్లాలో పరీక్షలు రాయనున్న 2.02 లక్షల విద్యార్థులు


విద్యార్థులు


మండల కేంద్రానికి చేరుకున్న పేపర్ బండిల్స్

రాయవరం: విద్యార్థి అభ్యసనాన్ని మదింపు చేసేందుకు విద్యాశాఖ ఏటా పరీక్షలు నిర్వహిస్తోంది. ఏటా నాలుగు ఫార్మేటివ్, రెండు సమ్మేటివ్ పరీక్షలు నిర్వహిస్తున్న విషయం పాఠకులకు విదితమే. అందులో భాగంగా ఎఫ్ఏ-3 పరీక్షలను మంగళవారం నుంచి 29వ తేదీ వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ 2,036 పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు 2022 నవంబర్‌లో ఎఫ్ఏ-1 పరీక్షలను ప్రయోగాత్మకంగా క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ (సీబీఏ) విధానంలో ప్రారంభించిన విషయం తెలిసిందే. ఎఫ్ఏ-2 పాత విధానంలో నిర్వహించగా, ఎఫ్ఏ-3 తిరిగి సీబీఏ విధానంలో నిర్వహిస్తున్నారు. 9,10 తరగతుల విద్యార్థులకు మాత్రం గతంలో మాదిరిగానే ఫార్మేటివ్ విధానంలో పరీక్షను నిర్వహిస్తారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా ఇదే విధానాన్ని అవలంబిస్తున్నారు. ఇందుకు సంబంధించి డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు పరీక్షల ఏర్పాట్లలో నిమగ్నమైంది.

ఉత్తమ ప్రమాణాలకు..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో అభ్యసన లోపాలను గుర్తించడంతో పాటుగా, పక్కా బోధనతో వారి సామర్థ్యాలను వెలికి తీయడం సీబీఏ పరీక్షల ప్రధాన ఉద్దేశం. గుణాత్మక విద్య, ఉత్తమ విద్యా ప్రమాణాలకు ఈ విధానం దోహద పడనుంది. ఎఫ్ఏ, ఎస్ఏల స్థానంలో సీబీఏ పరీక్షలు నిర్వహించనున్నారు. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎఫ్ఏ1,3, ఎస్ఏ 2కు బదులుగా నూతన విధానంలో పరీక్షలు నిర్వహిస్తారు. ఎఫ్ఏ 2,4, ఎస్ఏ1 పాత విధానంలోనే నిర్వహిస్తారు. 9,10 తరగతులకు నాలుగు ఎఫ్ఏలు, ఎస్ఏలు 2 పాత విధానంలో అమలు చేస్తారు.

9,10 తరగతులకు బైలింగ్విల్ ప్రశ్నపత్రం

సీబీఏ విధానంలో 1-8 తరగతుల వారికి ప్రశ్నపత్రం పూర్తిగా ఇంగ్లిష్ మీడియంలో ఉంటుంది. 9,10 తరగతులకు బైలింగ్విల్ ప్రశ్నపత్రం ఇస్తారు. ప్రశ్నలు ఎంయూఏ విధానంలో ఇస్తారు. 15 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానం, ఐదు మార్కులకు రాత పూర్వక జవాబు రాయాల్సి ఉంటుంది. ప్రశ్నలు విద్యార్థిని సమగ్రంగా అంచనా వేసే విధంగా ఉంటాయి. మెకానికల్, అండర్ స్టాండింగ్, అప్లికేషన్ (ఎంయూఏ) విధానంలో ఉంటాయి. ఓఎంఆర్ పత్రాల్లో జవాబులు నింపి జిల్లాకు పంపించాల్సి ఉంటుంది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 2,02,532 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ యాజమాన్యాల పరిధిలో 1,08,733 మంది, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో 93,799 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా, వీరందరూ ఎఫ్ఏ-3 పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రైవేట్ యాజమాన్యాలకు చెందిన విద్యార్థులు సాధారణ విధానంలోనే పరీక్షలు రాస్తారు. వీరికి సీబీఏ విధానంలో పరీక్షలు నిర్వహించరు.

మండల కేంద్రాలకు పంపాం



పరీక్ష పత్రాలు, ఓఎంఆర్ షీట్లు జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రాలకు పంపించాం. పరీక్ష పేపర్లకు ఎంఈవోలు కస్టోడియన్లుగా వ్యవహరిస్తారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం.
– బి.హనుమంతురావు, ప్రధాన కార్యదర్శి, డీసీఈబీ, అమలాపురం

విద్యార్థులకు అవగాహన ఉంది



క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ విధానంపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవగాహన ఉంది. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన మార్గదర్శకాలను జారీ చేశాం.
– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

యాజమాన్యాల వారీగా జిల్లాలో విద్యార్థుల వివరాలు

తరగతులు	ప్రభుత్వ+ఎయిడెడ్	ప్రైవేట్
1-5	42,044	56,313
6-10	66,719	37,480

టైమ్ టేబుల్

తేదీ	సమయం	సెషన్1	సమయం	సెషన్2
1-5 తరగతులు				
23	9.30-10.30	తెలుగు	1.20-2.20	గణితం
25	9.30-10.30	ప.వి	1.20-2.20	ఇంగ్లిష్-ఎ
			2.30-2.50	ఇంగ్లిష్-బి
6-8 తరగతులు				
23	1.10-2.10	తెలుగు	2.20-3.20	గణితం
25	1.10-2.10	హిందీ	2.20-3.20	సైన్స్(పీఎస్,బీఎస్)
27	1.10-2.10	సోషల్	2.20-3.20	ఇంగ్లిష్-ఎ
27	--		3.30-3.50	ఇంగ్లిష్-బి
29	1.10-2.10	ఓఎస్ఎస్‌సీ-1	2.20-3.20	ఓఎస్ఎస్‌సీ-2
9-10 తరగతులు				
23	9.30-10.15	తెలుగు	10.30-11.15	గణితం
25	9.30-10.15	హిందీ	10.30-11.15	సైన్స్(పీఎస్+బీఎస్)
27	9.30-10.15	సోషల్	10.30-11.15	ఇంగ్లిష్-ఎ
27న	11.30-11.50	ఇంగ్లిష్-బి (9వ తరగతికి మాత్రం)		
29	9.30-10.15	ఓఎస్ఎస్‌సీ-1	10.30-11.15	ఓఎస్ఎస్‌సీ-2

రూ.లక్షా 75 వేల విలువైన నకిలీ సిగరెట్లు స్వాధీనం


నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను పట్టుకున్న రీజనల్ విజిలెన్స్ అధికారులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల్లో రూ.లక్షా 75 వేలు విలువైన నకిలీ సిగరెట్లను అధికారులు పట్టుకున్నారు. ముందుగా వచ్చిన సమాచారం మేరకు రాజమహేంద్రవరం స్టేడియం రోడ్డులోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో శ్రీదేవి బిస్కట్స్, జనరల్ స్టోర్‌పై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ, లీగల్ మెట్రాలజీ, కమర్షియల్ టాక్స్ అధికారులు సోమవారం సంయుక్త దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బ్రాండెడ్ కాని 4,010 నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను గుర్తించారు. పారిస్, గోల్డ్ ఫైటర్, ఎ 10, హార్బర్, గోల్డ్ స్టాగ్, గోల్డ్ విమల్, గోల్డ్ విమల్ మింట్ వంటి నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను అధికారులు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని నిషేధిత పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు చేస్తున్న దుకాణ యజమాని దాసరి వెంకట కృష్ణారెడ్డి, సంబంధిత వ్యక్తులపై కోప్టా యాక్ట్ 2003 కింద క్రిమినల్ కేసు నమోదు చేశారు. వారిని టూటౌన్ పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎ.సురేష్‌బాబు మాట్లాడుతూ నిషేధిత సిగరెట్లను నిల్వ చేసినా, అమ్మకాలు జరిపినా సదరు దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో పట్టుబడ్డ సదరు బ్రాండెడ్‌కాని నిషేధిత సిగరెట్ ప్యాకెట్లను కాకినాడ నుంచి కొనుగోలు చేసినట్లు షాపు యజమాని తెలిపాడన్నారు. దాడుల్లో పట్టుబడ్డ దుకాణం, సంబంధిత వ్యక్తులపై నాలుగు కేసులు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ నాగ వెంకటరాజు, తహసీల్దార్ విజయకుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ జగన్నాథరెడ్డి, కానిస్టేబుళ్లు లోవకుమార్, వలీ పాల్గొన్నారు.

చంద్రవరంలో మహిళ దారుణ హత్య

కత్తితో దాడి చేసిన నిందితుడు


సుజాత మృతదేహం

చాగల్లు: చాగల్లు మండలం చంద్రవరంలో మహిళపై కత్తితో దాడి చేసి హతమార్చిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం చంద్రవరం గ్రామానికి చెందిన సింహాద్రి పూర్ణచంద్రరావు 15 ఏళ్ల క్రితం మృతి చెందాడు. అతని భార్య సుజాత (48) తన ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తోంది. ఐదేళ్ల క్రితం సుజాత కుమారుడి వివాహం సందర్భంగా ఇంటికి పెయింట్స్ వేయడానికి వచ్చిన అదే గ్రామానికి చెందిన చైతన్య కుమార్‌తో కుటుంబ సభ్యులకు పరిచయం ఏర్పడింది. సోమవారం ఇంటి డాబాపై సుజాత దుస్తులు ఆరబెడుతుండగా చైతన్యకుమార్ వచ్చి కత్తితో ఆమె మెడపై బలంగా దాడి చేసి హడావుడిగా పారిపోతుండగా కుటుంబ సభ్యులు గమనించారు. డాబాపై రక్తపు మడుగులో ఉన్న సుజాతను చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని కొవ్వూరు సీఐ రమణ పరిశీలించారు. సుజాత తండ్రి మద్దిపాటి నరసింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

పోటాపోటీగా జాతీయ టెన్నిస్ పోటీలు

డబుల్స్ విజేత హర్యానా, రన్నర్స్ గుజరాత్



జాతీయ టెన్నిస్ పోటీలలో డబుల్స్ విభాగంలో విజేతగా నిలిచిన హర్యానా జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): డీఎస్ఏలో జరుగుతున్న పాఠశాల క్రీడాసమాఖ్య 67వ జాతీయ స్థాయి అండర్-19 టెన్నిస్ పోటీలు సోమవారం పోటా పోటీగా జరిగాయి. మ్యాచ్‌లను రాష్ట్ర పాఠశాల క్రీడాసమాఖ్య కార్యదర్శి భానుమూర్తి రాజు, పోటీల జాతీయ పరిశీలకులు రామిరెడ్డి అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. పోటీల నిర్వహణ కార్యదర్శి ప్రసాద్, చీఫ్ రిఫరీ శ్రీకుమార్ పర్యవేక్షించారు. డబుల్స్ విభాగంలో డిమార్ట్ సమీపంలోని టెన్నిస్ కోర్టులు, పాత ఎస్పీ ఆఫీసు టెన్నిస్ కోర్టులలో మొత్తం 24 మ్యాచ్‌లు నిర్వహించారు. డబుల్స్ విభాగంలో హర్యానా గుజరాత్‌పై 2-0 స్కోర్‌తో విజయం సాధించి విజేతగా నిలువగా, గుజరాత్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. తృతీయ స్థానాన్ని మహారాష్ట్ర జట్టు, నాల్గవ స్థానాన్ని ఢిల్లీ జట్టు కైవశం చేసుకున్నాయి. క్రీడాకారులకు వసతి నుంచి క్రీడామైదానాలకు మోహన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎం.మోహన్ రావు సౌజన్యంతో ఉచితంగా బస్సులను ఏర్పాటు చేశారు. సోమవారం జరిగిన మ్యాచ్‌లను ఆర్జేడీ నాగమణి, డీవైఈఓలు రాజు, సుభద్ర, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్, ఎంఈఓలు రవి, ఏసుదాసు, శివ, ప్రసాద్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు రవిరాజు, బంగార్రాజు, రంగారావు తిలకించారు. పోటీల నిర్వహణ కమిటీలలో పీడీలు భానుమతి, ప్రసాద్, మేరీ విజయ, త్రిపుల, తులసి, సత్యగౌరి, సువర్చల, శ్రీహరి సేవలు అందించారు.

బాలిక హత్య కేసులో సవతి తల్లికి జీవిత ఖైదు

కాకినాడ లీగల్: బాలికను హత్య చేసినందుకు సవతి తల్లికి జీవిత ఖైదు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ కాకినాడ నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎం.హరి నారాయణ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ డెయిరీ ఫారం సెంటర్, సంజయ్‌నగర్, కొత్తపాకలు ప్రాంతానికి చెందిన సూరాడ శాంతి కుమారి 2019 నవంబర్ 22వ తేదీన తన సవతి కుమార్తె అయిన ఏడేళ్ల సూరాడ దీప్తిని జగన్నాథపురంలో చదువుతున్న స్కూల్ వద్ద నుంచి సంజయ్‌నగర్‌లో ఉంటున్న ఇంటికి తీసుకువెళ్లింది. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఆమె ఈ పనిచేసింది. అనంతరం బాలిక పీకను తువ్వాలుతో నులిమి హత్య చేసి, బాలికను మూటకట్టి ఇంద్రపాలెం బ్రిడ్జిపై నుంచి ఉప్పుటేరు కాలువలోకి పడవేసింది. బాలిక తండ్రి సత్య శ్యామ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై వన్‌టౌన్ పోలీసు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో శాంతి కుమారిపై నేరం రుజువుకావడంతో హత్య చేసినందుకు జీవిత ఖైదు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వై.ప్రశాంతి కుమారి ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

విద్యుత్ షాక్‌తో లైన్‌మన్ మృతి


విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన రాంబాబు

మామిడికుదురు: గోగన్నమఠం లైన్‌మన్‌గా పనిచేస్తున్న నవుండ్రు రాంబాబు (49) సోమవారం విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడ్డాడు. రొయ్యల చెరువుల వద్ద స్తంభంపైకి ఎక్కి రీ కనెక్షన్ ఇస్తుండగా షాక్‌కు గురై కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. రొయ్యల చెరువులకు సంబంధించిన విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో ఆ లైన్‌కు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం బిల్లు చెల్లించడంతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు రాంబాబు స్తంభం ఎక్కాడు. అయితే అప్పటికే ఎవరో ఆ లైన్‌కు విద్యుత్ సరఫరాను పునురుద్ధరించారు. ఈ విషయం తెలియని రాంబాబు స్తంభం ఎక్కి ప్రమాదానికి గురై కిందపడి మరణించాడు. అంబాజీపేట మండలం వాకలగరువు గ్రామానికి చెందిన రాంబాబు ఏడాదిన్నర కాలంగా ఇక్కడ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. నగరం ఎస్సై పి.సురేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

1398 మద్యం సీసాలతో మహిళ అరెస్ట్


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకువచ్చి విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన 1,398 మద్యం సీసాలను కోరంగి పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. కోరంగి ఎస్సై ఎస్.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామానికి చెందిన మహిళ పెస్సింగి దుర్గ మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆదేశాల మేరకు దాడి చేయగా అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, ఆ మహిళను అరెస్ట్ చేసి కాకినాడ స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.1.50 లక్షలకు పైగా ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో సురేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.